క్లుప్తంగా

నేడు విప్పర్తి ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు



పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో స్థానికులతో పాటు వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా వీరభద్రస్వామి జాతర



బి.దొడ్డవరం వీరభద్రస్వామి జాతరలో పాల్గొన్న కళాకారులు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని బొలిశెట్టివారిపాలెంలో ఆదివారం వీరభద్రస్వామి సంబరం వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనులపండువలా జరిపించారు. వైనతేయ గోదావరి నదికి భక్తులు ఊరేగింపుగా వెళ్లి నదీ స్నానాల అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు జరిపించారు. బొలిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగి సంబరంలో పలువురు భక్తులు పాల్గొని జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

క్రమశిక్షణతో క్రీడలు నేర్చుకోవాలి



అంబాజీపేటలో క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: క్రీడాకారులు ఏ క్రీడలైనా క్రమశిక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకుంటే విజయానికి దోహదపడతాయని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణను ఆదివారం ఆయన సందర్శించారు. ఇటీవల న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను ఎస్సై అందజేశారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ తైక్వాండో గేమ్స్ ఒలింపిక్ క్రీడాపోటీల్లో ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రమం తప్పకుండా తర్ఫీదు పొంది ఒలింపిక్ పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ పి.మణికంఠ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గొల్లపల్లి విజయానికి కృషి

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు విజయానికి రాబోయే ఎన్నికల్లో కృషి చేస్తామని అంతర్వేదికర గ్రామానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. ఆదివారం పార్టీ నాయకుడు బెల్లంకొండ ఏసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ కలయికలో గొల్లపల్లి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మళ్లీ సీఎంగా జగన్‌ని విజయపథంలో నిలపాలని గొల్లపల్లి పిలుపునిచ్చారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గెద్దం అమ్ములు, దూది త్రినాథ్, బెల్లంకొండ సూరిబాబు, మండపాక వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో సప్తాహ జ్ఞానయజ్ఞం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం మద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమం వైభవంగా మొదలైంది. పండిత రత్న ఎంటీ ఆళ్లార్ స్వామితో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు భక్త బృందం తెలిపింది. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

మామిడికుదురు: అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఆదివారం పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. చైతన్యరథంపై నిల్చొని ఓటర్లకు దండం పెడుతూ ర్యాలీగా సాగారు. ఓటర్లను కలుసుకుని ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వేడుకున్నారు. పార్టీ నాయకులు నామన రాంబాబు, అడబాల తాతకాపు, కొమ్ముల కొండలరావు, మొల్లేటి శ్రీనివాస్, బోణం బాబు తదితరులు పాల్గొన్నారు.

పాల దిగుబడిపై వడదెబ్బ

- వడదెబ్బకు గురైతే చూడి అవకాశం లేనట్లే
- ప్రాణాలకూ ప్రమాదమే..



అంబాజీపేటలో ఆరుబయట ఉన్న పశువులు

అంబాజీపేట: వేసవిలో పాడి రైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల పాల ఉత్పత్తి తగ్గడమే కాక.. ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడి కట్టే అవకాశం ఉండదని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కోసారి పశువు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో ఆవులు 9,500, గేదెలు 12,300, కొత్తపేట నియోజకవర్గంలో ఆవులు 6180, గేదెలు 8,500, రాజోలు నియోజకవర్గంలో ఆవులు 5,150, , గేదెలు 8,070 ఉన్నాయి.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధి బారిన పడతాయి. రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసుల ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కోసారి కింద పడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి కోల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించి, దగ్గరలోఉన్న పశువైద్యులను సంప్రదించాలి. వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి.

వడదెబ్బ తగలకుండా..



పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులకు, గేదెలకు పంకాలు ఏర్పాటు చేయాలి.

– డి.రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి, అంబాజీపేట

బీసీలకు సీఎం జగన్ అగ్రపీఠం



సఖినేటిపల్లిలో ఆబోతు గుడి వద్ద బీసీ నాయకులు, మహిళలతో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలకు అగ్రపీఠం వేశారని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం సఖినేటిపల్లి ఆబోతు గుడి వద్ద బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులను, మహిళలను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ, గత పాలకులు బీసీలను నిర్లక్ష్యం చేస్తే, వారికి సముచిత గౌరవాన్ని అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఇటువంటి సీఎంని మరోసారి గెలిపించుకుంటే పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, నాయకులు ఆరిపల్లి సత్యనారాయణ, చింతా పండు, కొల్లాబత్తుల కుమార్, మోకా సురేష్, ఎస్.రక్షణ, మహిళలు పాల్గొన్నారు.

ప్రచారంలో గొల్లపల్లికి మహిళల నీరాజనం



మగటపల్లిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లికి హారతి ఇస్తున్న మహిళలు

మామిడికుదురు: రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు మగటపల్లిలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు మహిళలు హారతులు ఇచ్చి నీరాజనం పలికారు. బొట్టు పెట్టి వీర తిలకం దిద్దారు. సీఎం జగన్ పాలన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని సూర్యారావు పేర్కొన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేత జగన్ అని, అతని నాయకత్వంలో పని చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా జగన్‌కు గెలుపు భరోసా ఇస్తున్నారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. యూత్ విభాగం కోనసీమ జిల్లా అధ్యక్షుడు సూరిశెట్టి బాబి అధ్యక్షతన జరిగిన ప్రచారంలో మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు మట్టా గంగయ్య, బండారు పండు, బొంతు సత్యనారాయణ, కలిగితి రామకృష్ణ, ఇందుగి వెంకటేశ్వరరావు, బొడ్డపల్లి సాయిబాబు, బొంతు శివ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో గొల్లపల్లి ప్రత్యేక ప్రార్థనలు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం శివారు అద్దాలపాలెం లూథరన్ చర్చిలో ఆదివారం వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ ఆయనకు ప్రభువు తరఫున దీవెనలు అందజేశారు. అనంతరం క్రైస్తవ సోదరసోదరీమణులను ఉద్దేశించి గొల్లపల్లి ప్రసంగించారు. ప్రభువు మహిమ గురించి ఆయన వివరించారు. వెంట నల్లి సురేంద్ర, మందపాటి సత్యనారాయణ, ఈద రవి రెడ్డి, నల్లి త్రిమూర్తులు, కొల్లాబత్తుల కుమార్ పాల్గొన్నారు.

జగన్, జగ్గిరెడ్డిల గెలుపునకు కృషి చేస్తాం

కొనసాగుతున్న వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రాజీనామా చేసిన తర్వాత ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసిన ఊబలంక వలంటీర్లు

రావులపాలెం: జగనన్న, జగ్గిరెడ్డిలను గెలిపించుకోవడమే మా లక్ష్యం, మా ధ్యేయం అంటూ వారి గెలుపు కోసం కృషి చేస్తామని రాజీనామాలు చేసిన వలంటీర్లు స్పష్టం చేశారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామం నుంచి 49 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఆదివారం వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని కలిసి, చిర్ల గెలుపు కోసం, జగనన్న గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. వలంటీర్లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి పథకాన్ని ఇంటి వద్దకే అందించామన్నారు. అలాగే ఉన్నత వర్గాల వారికి కూడా ప్రభుత్వ కార్యాలయాలలో ఏ విధమైన అవసరం ఉన్నా సహాయపడ్డామని, వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఉదయాన్నే అందించేవారమన్నారు. చంద్రబాబునాయుడు సూచనలతో ఒక సంస్థ చేసిన ఫిర్యాదుతో నేడు పింఛన్ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి నేతల నీచ రాజకీయాలకు బుద్ధి చెప్పేందుకే రాజీనామాలు చేసి ప్రజలలోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి జగ్గిరెడ్డి గెలుపుకు, జగనన్న గెలుపుకు కృషి చేస్తామన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లిడి రామిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బిరామిరెడ్డి, యూత్ లీడర్ నడింపల్లి వర్మ, మేడపాటి చంద్రాసుబ్బారెడ్డి, సచివాలయం కన్వీనర్లు మేడపాటి శ్రీనివాసరెడ్డి (కొటా శ్రీను), చిన్నం సోమిరెడ్డి, ద్వారంపూడి హరీష్ రెడ్డి, చిన్నం వెంకట కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆనందరావుకు ఉగాది పురస్కారం



హెచ్ఎం ఆనందరావుకు ఉగాది పురస్కారాన్ని అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కత్తుల ఆనందరావు ఆదివారం అమలాపురంలో జరిగిన జాతీయ శతాధిక సమ్మేళనంలో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఆనందరావుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, సినీ కళాకారుడు గుర్రం రామకృష్ణ చేతుల మీదుగా ఆనందరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

మరోసారి జగనే సీఎం

పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి



నేదునూరులో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

అయినవిల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జనరంజకంగా పాలించేంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఆయనతోనే సాధ్యపడుతోందని మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం అయినవిల్లి మండలంలోని నేదునూరు, ఎస్.పెదపాలెం, నల్లచెరువు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. కరోనా వంటి మహమ్మారి విజృంభించినప్పుడు కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సేవలను ఎన్నడూ రాష్ట్ర ప్రజలు మరువలేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. జనం మెచ్చిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలన్నారు. మొత్తం రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పేరిచర్ల రఘురామరాజు, కనుమూరి సత్యనారాయణరాజు, గుమ్మడి ప్రసాద్, తిప్పా చైతన్యకుమార్, జోగి బాబ్జి, చిలువూరి సాయిరాజు, వాసంశెట్టి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకే ఆ పార్టీ కండువాలు

- నియోజకవర్గంలో పసుపు నేతల కలరింగ్
- వైఎస్సార్ సీపీలోకి వలసలతో దిక్కుతోచని టీడీపీ నేతలు



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

కొత్తపేట: రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన, నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పనితీరు మెచ్చి టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలతో కూటమి ప్రతిపక్ష టీడీపీ నేతలకు దిక్కుతోచడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో టీడీపీ, జనసేన పార్టీల నుంచి అన్ని వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడి రాజీనామాలు చేసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. అంతే కాకుండా ఇటీవల రావులపాలెంలో జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బహిరంగ సభ జనం రాక పూర్తిగా ఫెయిలైందన్నారు. దీనితో దిక్కుతోచని టీడీపీ నేతలకు ఏమి చేయాలో తోచక వారి పార్టీలో ఉన్న కార్యకర్తలకే టీడీపీ కండువాలు కప్పుతున్నారని ఎద్దేవా చేశారు.

10 న గ్రామ స్థాయిలో పార్టీ సమావేశాలు

జగరనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10 న గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. రోజు ఉదయం 9 గంటలకు స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కొత్తపేట, మందపల్లి గ్రామాలు, 11 గంటలకు వాడపాలెంలో, మధ్యాహ్నం 3 గంటలకు వానపల్లిలో, 4 గంటలకు బిళ్లకుర్రులో సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాల్లో ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఖండ్రిగ వీడీసీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి ఆధ్యాత్మిక శోభ



స్వామిని వాహనాలపై ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు ఆదివారం ఆధ్యాత్మికతతో శోభిల్లింది. చతుర్వేద పారాయణ, ద్రవిడ పారాయణ, దివ్య ప్రబంధనం తదితర వేద కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు పాల్గొని చతుర్వేద, వేద పారాయణలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ని సింహ, గరుడ వాహనంపై ఊరేగించారు. అధ్యయనోత్సవాల గురించి భక్తులకు వేదపడితులు శాస్త్రోక్తంగా వివరించారు. దివ్య ప్రబంధనం, సర్వాధికారము ద్వాపరయుగాంత సమయంలో శ్రీకృష్ణ పరమాత్మకు కలిగిన నిర్వేదన అన్నారు. ఆయన ఆశయం సఫలం చేయడం కోసం ఆళ్వార్లు తమ భగవద్గీత అనుభవాన్ని మొదటి నుంచి చివరి వరకు తిరువాయ్‌మొళిగా అనుగ్రహించారు. అనంతరం ఆళ్వారులు ప్రసాదా వినియోగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



పెదపళ్ల పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి 'నా ఆరోగ్యం–నా హక్కు' అంటూ నినాదాలు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్‌ఈలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక జాతర



చింతలూరులో తీర్థంలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

ఆలమూరు: కోస్తా జిల్లాల్లో ప్రఖ్యాతి గాంచిన ఆలమూరు మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. మహిళలు తమ చిన్నారులతో కాగడాలు వెలిగించి బాలారిష్టాలను నివారించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన వారకల్లు, తుష్టిబిళ్లలను తల్లిదండ్రులు తమ చిన్నారులతో స్వీకరింపజేశారు. సుదూర, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తాకిడికి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. చిన్నారులకు, యువతకు వినోదాన్ని పంచే జెయింట్‌వీల్స్, కొలంబస్, రంగులరాట్నం తదితర వినోద సాధనాలను తీర్థంలో నెలకొల్పడంతో సందడి నెలకొంది. అమ్మవారి జాతర సందర్భంగా చర్మ వాయిద్య కళాకారులు శబ్దాలకు అనుగుణంగా ఆలయ అర్చకులు చేపట్టిన గరగ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాండు సన్నాయి వాయిద్య మేళాలు, విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు, శక్తి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ నేతృత్వంలోని రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీనునాయక్ ప్రత్యేక పహారా నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ అత్యంత శోభాయమానంగా విరాజిల్లింది. గ్రామం నలుమూలలకు విద్యుద్దీపాలంకరణ చేపట్టడమే కాకుండా ప్రతి కూడలిలోనూ విద్యుద్దీపాలంకరణతో కూడిన దేవతామూర్తుల పటాలను నెలకొల్పారు. జిల్లాలో ప్రసిద్ధిచెందిన బాణసంచా తయారీదారులతో తయారు చేయించిన బాణసంచా కాల్పులు జాతరలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



గూడపల్లిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మండలంలోని గూడపల్లి మెయిన్ పంచాయతీకి చెందిన మోకా సురేష్, మోకా రాజ్‌కుమార్ ఆధర్వంలో టీడీపీ జనసేన పార్టీల నుంచి పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గం అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నందుకు ధన్యవాదాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ చేసిన అభివృద్ధికి, టీడీపీ స్వార్థ రాజకీయాలకు మధ్య జరిగే పోరాటమే ఇదని అన్నారు. పార్టీ నాయకులు ఇంటిపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



అంబాజీపేటలో వేసవి తాపానికి నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: ఎండలు మండుతున్నాయి... ఓ పక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి ప్రతాపం గత నాలుగు రోజుల నుంచి రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిదైతే చాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడాల్సిన పరిస్థితి. కూలీ పనులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయట ఎండల వల్ల విపరీతమైన ఉక్కపోత, వేడిగాలి తాళలేక పొలాల్లో నీడల్లో సేద తీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలో గత నాలుగు రోజుల నుంచి 36 డిగ్రీల నుంచి 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లపై ప్రయాణించలేక వాహన చోదకులు ఎక్కడ చెట్ల నీడ కనిపిస్తే అక్కడ ఆగిపోయి సేద తీరుతున్నారు. వాతావరణం చల్లబడిన వేళలో మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఇదే విధంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగితే ప్రజలకు వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీలున్నంత వరకు నీడ ప్రదేశాల్లో ఉండాలని, మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి బొండాలు తాగితే మంచిదని సూచిస్తున్నారు. సమయానికి భోజనం చేయాలని, పిల్లలు, వృద్ధులు ఎండల్లో తిరగకూడదని తెలిపారు.